
సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం । 1 । ఏప్రిల్ । 2025



బాంబ్ స్క్వాడ్ తనిఖీలు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయంలో సోమవారం డాగ్, బాంబ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారు. ఆలయ భద్రతలో భాగంగా ఈ తనిఖీలు చేపట్టినట్టు అధికారులు చెప్పారు.



అడవిలో అమృతధార

వేసవిలో వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు అటవీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన నీటి తొట్టెలు సత్ఫలితాలనిస్తున్నాయి. 8లో



కొట్లాటలో యువకుడి మృతి

వీరవాసరం మండలం నందమూరి గరువులో కోటసత్తెమ్మవారి జాతరలో జరిగిన ఘర్షణలో ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. 8లో

న్యూస్‌రీల్

డిజిటల్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలి



సమావేశమైన డిజిటల్ అసిస్టెంట్లు

భీమవరం: జిల్లా డిజిటల్ అసిస్టెంట్స్ జాయింట్ యాక్షన్ కమిటీ నూతన కార్యవర్గం భీమవరంలో ఏకగ్రీవంగా ఎన్నికైంది. సోమవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో అధ్యక్షుడిగా ఆలీషా, ప్రధాన కార్యదర్శిగా వెంకటేష్, కోశాధికారిగా ఆదిత్య, మహిళా విభాగం కార్యదర్శిగా అనురాధ, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం అధ్యక్షుడు ఆలీషా మాట్లాడుతూ జిల్లాలో అర్హులైన 277 డిజిటల్ సహాయకులను గణాంకాల శాఖలో విలీనం చేసేలా రూపొందించిన కమిటీని ప్రభుత్వం రద్దు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం పునః పరిశీలన చేసి కమిటీ పునరుద్ధరించాలని కోరారు. ఉన్నత విద్యార్హతలు కలిగిన వారికి టెక్నికల్ పదోన్నతులు కల్పించాలన్నారు. ఆధార్ సూపర్‌వైజర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ప్రభువు మార్గం అనుసరణీయం



కేక్ కట్ చేస్తున్న బిషప్ జయరావు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏసుక్రీస్తు మార్గంలో ప్రతి క్రైస్తవుడూ పయనించిన నాడే శాంతి, సమాధానాలు లభిస్తాయని ఏలూరు పీఠాధిపతి బిషప్ పొలిమేర జయరావు అన్నారు. స్థానిక గ్జేవియర్ నగర్‌లో ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు 33వ గురు పట్టాభిషేక వార్షికోత్సవాన్ని నిర్మలగిరి పుణ్యక్షేత్ర డైరెక్టర్ ఫాదర్ జాన్ పీటర్, నిర్మలగిరి పుణ్యక్షేత్ర అన్నదాన ట్రస్ట్ చైర్మన్ క్లే నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిషప్ పొలిమేర జయరావు మాట్లాడుతూ పొరుగువారిని ప్రేమతో ఆదరించాలని, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి ఎల్లవేళలా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. అమలోద్భవి కథీడ్రల్ విచారణ గురువు ఫాదర్ ఇంజమూల మైఖేల్ మాట్లాడుతూ బిషప్ జయరావు విశేష సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. తొలుత కేక్ కట్ చేసి మహోత్సవాన్ని నిర్వహించారు. మేత్రాసనం ప్రొక్యూరేటర్ ఫాదర్ బి.రాజు, నిర్మలగిరి పుణ్యక్షేత్ర విచారణ గురువు జాన్ పీటర్, నాగేశ్వరరావు బిషప్ జయరావును గజమాలతో సన్మానించారు. క్లే లలిత ట్రస్ట్ చైర్మన్ భక్తుల సౌకర్యార్థం ఏసీ, రెండు వాటర్ రిఫ్రిజిరేటర్లను అందజేశారు.


బాడీ బిల్డింగ్‌లో ప్రతిభ



జాతీయ స్థాయిలో స్వర్ణ పతకం అందుకుంటున్న భానుప్రకాష్

ఏలూరు రూరల్: ఏలూరుకు చెందిన భాను ప్రకాష్ జొమాటో డెలివరీ బాయ్‌గా పనిచేస్తూ బాడీ బిల్డింగ్‌లో రాణిస్తున్నాడు. ఇటీవల షిరిడీలో ఇండియన్ బాడీ బిల్డింగ్, ఫిట్‌నెస్ ఫెడరేషన్ నిర్వహించిన జాతీయస్థాయి సీనియర్, జూనియర్ బాడీ బిల్డింగ్ పోటీల్లో 55 కేజీల విభాగంలో స్వర్ణ పతకం సాధించాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా డెలివరీ బాయ్‌గా పనిచేస్తూనే బాడీ బిల్డింగ్‌పై మక్కువతో ఈ రంగంలో శ్రమిస్తున్నాడు. దాతలు ఆకుల బ్రదర్స్ ఆర్థిక సాయంతో ప్రత్యేక శిక్షణ తీసుకున్నాడు. 2019 నుంచి ఇప్పటివరకూ జిల్లా, జోనల్, రాష్ట్రస్థాయిలో పలు పతకాలు సాధించాడు. తాజాగా జాతీయ స్థాయిలో సత్తాచాటి అంతర్జాతీయ స్థాయిలో విజయమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాడు.

నేడు టెన్త్ సోషల్ పరీక్ష



భీమవరం: ఎస్‌ఎస్‌సీ, ఓఎస్‌ఎస్‌సీ, ఒకేషనల్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా మంగళవారం సాంఘిక శాస్త్రం పరీక్ష జరుగుతుందని జిల్లా విద్యాశాఖాధికారి ఈ.నారాయణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, జిల్లాపరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించనున్నామని డీఈఓ నారాయణ పేర్కొన్నారు.

ఈద్ ముబారక్

ప్రేమ, దయ, క్షమ, సహనం, త్యాగానికి ప్రతీకగా నిలిచే రంజాన్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. జిల్లావ్యాప్తంగా మసీదులు, మైదానాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసి ఒకరికొకరు 'ఈద్' శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మత పెద్దలు, ఇమామ్‌లు రంజాన్ సందేశాన్నిచ్చారు.

– సాక్షి నెట్‌వర్క్



ఆకివీడు : ఆకివీడులో చిన్న మసీదు వద్దకు ప్రదర్శనగా వెళుతున్న ముస్లింలు



తాడేపల్లిగూడెం (టీటీసీ) : తాడేపల్లిగూడెం పెద్ద మసీదు వద్ద ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : ఈద్గాహ్‌లో సందేశం ఇస్తున్న ప్రభుత్వ ఖాజీ షేక్ హుస్సేన్

తెగ తాగించేస్తున్నారు!

ఫుల్లుగా తాగించడమే 'టార్గెట్'

- మద్యం అమ్మకాలు పెంచుకునే పనిలో ప్రభుత్వం
- గతేడాది సేల్స్‌పై 20 శాతం పెంచాలని ఉన్నతస్థాయి నుంచి ఒత్తిడి
- లక్ష్యాన్ని చేరేందుకు నిబంధనలు గాలికొదిలేస్తున్న ఎక్సైజ్ శాఖ
- నైట్ పాయింట్ల పేరిట తెల్లవార్లూ అమ్మకాలు
- శాంతిభద్రతలకు విఘాతం
- గత రెండు నెలల్లో ఆరు నుంచి వంద శాతానికి పైగా అమ్మకాలు



సాక్షి, భీమవరం: జిల్లాలో 175 మద్యం షాపులకుగాను ఇటీవల గీత కార్మికులకు 18 షాపులు మంజూరు చేయడంతో ప్రస్తుతం వాటి సంఖ్య 193కు పెరిగింది. జిల్లాలో రోజుకు దాదాపు రూ.4 కోట్ల మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. మద్యంపై మరింత ఆదాయాన్ని రాబట్టేందుకు ప్రభుత్వం ఎక్సైజ్ అధికారులకు నెలవారీ టార్గెట్లు విధిస్తోంది. గతేడాది అదే నెలలో సేల్స్‌పై 20 శాతం అదనంగా అమ్మకాలు పెంచేలా సరుకును లిఫ్టింగ్ చేయాలని ఒత్తిడి తెస్తోంది. ఏదోవిధంగా అమ్మకాలు పెంచుకుని సరుకు లిఫ్టింగ్ చేయాలనడంతో నిబంధనల అమలులో అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఇదే అదనుగా ఎంఆర్‌పీ ధరలు, బెల్టు షాపుల ఏర్పాట్లలో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే జిల్లా అంతటా మద్యం బాటిల్‌పై ఎంఆర్‌పీ ధరకు మించి రూ.10 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. ఒక్కో షాపు పరిధిలో రెండు నుంచి ఐదు వరకు బెల్టులు నిర్వహిస్తున్నారు.

గణనీయంగా అమ్మకాలు

గతేడాదిలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో జరిగిన అమ్మకాలతో పోలిస్తే ప్రస్తుత ప్రైవేట్ దుకాణాల్లో మద్యం అమ్మకాలు గణనీయంగా పెరిగాయి. ఈ ఏడాది జనవరిలో లిక్కర్ అమ్మకాలు 4 నుంచి 11 శాతం పెరగ్గా, బీర్ల అమ్మకాలు 41 నుంచి 79 శాతం వరకు పెరగడం గమనార్హం. ఫిబ్రవరిలో 14 శాతం వరకు లిక్కర్ అమ్మకాలు పెరిగితే బీర్లు అమ్మకాలు ఏకంగా 116 శాతం పెరిగాయి. ఉదాహరణకు ఆకివీడు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గతేడాది ఫిబ్రవరిలో 4,022 కేసుల బీర్లు అమ్ముడుపోగా ఈ ఏడాది ఫిబ్రవరిలో 8,700 కేసులు అమ్ముడయ్యాయి. అమ్మకాలు పెంచుకునేందుకు ప్రభుత్వం నిబంధనలకు గాలికొదిలేస్తుండటంతో జిల్లా అంతటా మద్యం మత్తులో జరుగుతున్న తగాదాలు పెరిగిపోతుండటం ఆందోళన కలిగిస్తోంది. మద్యం దుకాణాల వద్ద నిబంధనల అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

గతేడాది, ఇప్పటి మద్యం అమ్మకాలు

	2024 జనవరి	2025 జనవరి
లిక్కర్ కేసులు	1,58,638	1,66,756
బీర్లు కేసులు	53,141	81,877

	2024 ఫిబ్రవరి	2025 ఫిబ్రవరి
లిక్కర్ కేసులు	1,28,686	1,35,881
బీర్లు కేసులు	37,510	61,006

గత ప్రభుత్వంలో.. నిర్ణీత వేళల్లో..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మద్యం దుకాణాలు ప్రభుత్వ ఆధీనంలో ఉండటంతో కచ్చితంగా నిబంధనలు అమలయ్యేవి. నిర్ణీత వేళల్లో మాత్రమే అమ్మకాలు జరిగేవి. షాపు వద్ద మద్యం కొనుగోలు చేసి తీసుకుపోవడమే తప్ప అక్కడ తాగేందుకు వీలుండేది కాదు. బెల్టుషాపులకు ఆస్కారమే లేదు. జనావాసాల్లో కాకుండా ఊరికి దూరంగా దుకాణాలు ఉండేవి. నాటి పరిస్థితికి పూర్తి భిన్నంగా ఇప్పుడు కూటమి ప్రభుత్వం మద్యం అమ్మకాలు సాగిస్తోంది. మద్యం దుకాణాలను జనావాసాల్లోకి తెచ్చింది. గ్రామాల్లో అనధికార బెల్టుషాపులు ఏర్పాటుచేసి రాత్రీపగలూ తేడాలేకుండా విక్రయాలు చేస్తోంది.



మార్చి 19న తణుకులోని ఉండ్రాజవరం గణేష్‌చౌక్ ప్రాంతంలోని మద్యం దుకాణం వద్ద నైట్‌పాయింట్ పేరిట అనధికారికంగా తెల్లవార్లు మద్యం అమ్మకాలు చేస్తున్నారు. ఈనెల 19న వేకువజామున మద్యం కోసం వచ్చిన ఒక వ్యక్తికి, షాపు సిబ్బందికి మధ్య డిజిటల్ పేమెంట్‌పై వివాదం తలెత్తింది. ఈ ఘటనలో షాపులో పనిచేసే వ్యక్తిపై సదరు వ్యక్తి ఇనుప రాడ్‌తో విచక్షణారహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. గత ప్రభుత్వంలో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు మాత్రమే మద్యం అమ్మకాలు చేసేవారు. ప్రస్తుతం జిల్లాలోని చాలా షాపుల్లో నైట్ పాయింట్లు నిర్వహిస్తున్నారు. రాత్రి అమ్మకాలతో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.



మార్చి 28న తణుకు రూరల్ మండలం వేల్పూరులోని మద్యం దుకాణం కాంపౌండ్‌లో అనుమానాస్పద రీతిలో వ్యక్తి మృతిచెందడం వివాదాస్పదంగా మారింది. అతడి ఒంటిపై గాయాలుండటంతో మద్యం దుకాణం వద్ద ఎవరో కొట్టి హత్య చేశారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వంలో మద్యం దుకాణం వద్ద కేవలం అమ్మకాలు మాత్రమే జరిగేవి. ఇప్పుడు సిట్టింగ్ ఏర్పాట్లు చేసి మద్యం సేవించేందుకు వాటర్ బాటిళ్లు, గ్లాసులు, ఫుడ్ ఐటమ్స్ అన్నీ అక్కడే అందిస్తున్నారు. ఇది నిబంధనలకు విరుద్ధమే అయినా అధికారులు వాటి జోలికి పోవడం లేదు.

ట్రైనీ డాక్టర్ అంజలికి న్యాయం చేయాలి



జీలుగుమిల్లిలో ప్రజా సంఘాల నిరసన

బుట్టాయగూడెం : రాజమండ్రి బొల్లినేని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ట్రైనీ డాక్టర్ అంజలికి న్యాయం చేయాలంటూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం జీలుగుమిల్లిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. సీఐటీయూ నాయకురాలు ఎ.శ్యామలారాణి మాట్లాడుతూ అంజలి కుటుంబానికి న్యాయం జరిగే వరకూ అండగా ఉంటామన్నారు. అంజలి ఆత్మహత్యాయత్నానికి కారణమైన వ్యక్తిని పోలీసులు కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల నాయకులు ముత్యాలమ్మ, సుధారాణి, వెంకటలక్ష్మి, బుల్లెమ్మ, సీతారామయ్య, బి.రాంబాబు, సీహెచ్ కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలానికి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు



ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): భద్రాచలంలో సీతారామచంద్రస్వామి కల్యాణోత్సవం సందర్భంగా ఈనెల 5న ఏలూరు నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటుచేసినట్టు ఏలూరు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్ తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం 3 గంటలు, సాయంత్రం 7 గంటలకు బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. సీట్లకు రిజర్వేషన్లు ప్రారంభించామని, ఆన్‌లైన్‌లో కూడా బుక్ చేసుకోవచ్చన్నారు. ఒకే ఊరు నుంచి 40 లేదా 50 మంది భక్తులు ఉంటే ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేస్తామన్నారు.

ఉనికిలి.. పేకాట వాకిలి!

- టీడీపీ నేత అడ్డాలో పేకాట, కోడిపందేలు
- గుడివాడ నియోజకవర్గం నుంచి జూదరులు
- యథేచ్ఛగా జూదాల నిర్వహణ
- కన్నెత్తి చూడని ఖాకీలు

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : పగలూ రాత్రీ తేడా లేకుండా పేకాట, కోడిపందేలు యథేచ్ఛగా సాగుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఏలూరు జిల్లా మండవల్లి మండలం ఉనికిలి గ్రామంలో ఓ టీడీపీ నేత పేకాటయ్య అవతారం ఎత్తాడు. తన ఇంటినే జూదశాలగా మార్చేశాడు. ఫోన్లు చేసి ఊ.. కొడతారా.. ఉనికిలికి పేకాట, కోడిపందేలకు వస్తారా.. అంటూ ఆహ్వానాలు పంపుతున్నాడు. కైకలూరు నియోజకవర్గంలో పేకాట, కోడిపందేలకు ఉనికిలి గ్రామం కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఒకప్పుడు సర్పంచ్‌తో సహా వార్డు సభ్యులు అందరూ మహిళలే కావడంతో ఆదర్శ గ్రామంగా ఉనికిలి నిలిచింది. నేడు జూదశాలగా పేరు రావడంపై గ్రామస్తులు మధనపడుతున్నారు.

అధికారం మాది అన్న ధోరణిలో..

ప్రశాంత పల్లె వాతావరణానికి మారుపేరు ఉనికిలి గ్రామం. మొత్తం 10 వార్డులు ఉండగా 6 వార్డులు ఉనికిలిలో, సుబ్బారావుపేటలో 2, మూలపేటలో 2 వార్డులు ఉన్నాయి. సుమారు జనాభా 2,000 పైనే ఉంది. గ్రామంలో ఒక పెద్ద కుటుంబానికి చెందిన కోటీశ్వరుడిగా పేరు పొందిన వ్యక్తి గ్రామం మొత్తానికి చెడ్డ పేరు తెస్తున్నాడు. అధికారం మాది.. పాలించేది మా వాడే అన్న ధోరణిలో చెలరేగిపోతున్నాడు. ఇటీవల వరదల సమయంలో పర్యటనకు వచ్చిన కూటమి నాయకులకు విందు భోజనం వడ్డించి ఆకట్టుకున్నాడు. పేకాట, కోడిపందేలకు మూలస్తంభంగా నిలిచే భైరవపట్నం ఐస్ ఫ్యాక్టరీ యజమాని ఆశీస్సులు దండిగా నిర్వాహకుడికి ఉండటంతో ఆడిందే పేకాట, కాలు దువ్వింది కోడిపందేలుగా వ్యవహారం మారింది. జూద నిర్వాహకుడి చేతికి దెబ్బ తగిలినా లెక్కచేయకుండా జూదాలు ఆడిస్తున్నాడు.



నందివాడ టూ ఉనికిలి

మండవల్లి మండలం ఉనికిలి గ్రామానికి సమీపంలో గుడివాడ నియోజకవర్గం నందివాడ మండలంలో రుద్రపాక, పోలుకొండ గ్రామాలు ఉన్నాయి. అక్కడ నుంచి ఉనికిలి గ్రామానికి రోజూ కోడిపందేలు, పేకాట ఆడటానికి బడాబాబులు వస్తున్నారు. పండుగల వేళ ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉంది. ఉగాది రోజంతా ఉనికిలిలో ప్రధాన నిర్వాహకుడి ఇంటి పక్కనే కోడిపందేలు, పేకాట యథేచ్ఛగా జరిగాయి. జూదాల కోసం ప్రత్యేక షెడ్డును కూడా ఏర్పాటుచేశారు. పేకాటతో పాటు కోరుకున్న మద్యం అందుబాటులో ఉంచుతున్నారు. గ్రామంలోని బ్యాంకు వీధిలో జూద నిర్వాహకుడి ఇల్లు శివారున ఉండటం అతడికి కలిసొచ్చింది.

పోలీసులపై తీవ్ర ఒత్తిళ్లు

జూదాలు ఇంతలా నిర్వహిస్తున్నా పోలీసులు కన్నెత్తి చూసే సాహసం చేయడం లేదు. మండవల్లి ఎస్సై సాహసించి వెళ్లినా భైరవపట్నం ఐస్ ఫ్యాక్టరీ నుంచి ఫోన్ వెళ్తుంది. పెద్దాయనతో చెప్పమంటారా? ఉద్యోగం చేయాలని ఉందా? వెళ్లిపోతారా.. అనే ధిక్కార స్వరం వినిపిస్తోంది. ఎస్సై కంటే పై అధికారి పట్టించుకుంటారా అంటే అదీ లేదు. ఇటీవల వైస్ ఎంపీపీ ఎన్నికల్లో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌కు తలనొప్పిగా మారిన గడ్డం బాబు ఏకంగా మండవల్లి ఎస్సై మీదకు గొడవకు వెళ్లాడు. ఇంత జరిగినా ఆయన్ను పోలీసు అధికారులు ఏం చేయలేని పరిస్థితి. తీవ్ర ఒత్తిళ్లతో మండవల్లి మండలంలో పోలీసులు విధులు నిర్వహించలేక సతమతమవుతున్నారు.

రెడ్‌బుక్ పాలనతో ప్రజాజీవనం అస్తవ్యస్తం

మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ పాలన అవలంబించడంతో రాష్ట్రంలో ప్రజాజీవనం అస్తవ్యస్తంగా మారిందని మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం తాడేపల్లిగూడెంలోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మించి సంక్షేమం అందిస్తామని, సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని ప్రజలను నమ్మించి మరోసారి మోసగించి అధికారంలోకి వచ్చిన నయవంచకుడు చంద్రబాబు అని విమర్శించారు. వలంటీర్లకు నెలకు జీతం రూ.10 వేలు ఇవ్వాలని చెప్పిన కూటమి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎక్కడా కానరావడం లేదన్నారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితమని చెప్పి కొందరికే పథకాన్ని అమలు చేయడం వారి అసమర్థతకు నిదర్శనమన్నారు. తల్లికి వందనం పథకానికి రూ.12 వేల కోట్లు అవసరం కాగా బడ్జెట్‌లో రూ.8,500 కోట్లు కేటాయించడం ద్వారా పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయలేమని కూటమి ప్రభుత్వం తేటతెల్లం చేసిందన్నారు. మహిళలకు నెలకు రూ.1,500, నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3 వేలు ఇస్తామన్న హామీల అమలుకు బడ్జెట్‌లో కేటాయింపులు లేవన్నారు. రాష్ట్రానికి వస్తున్న కోట్ల రూపాయల ఆదాయాన్ని ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. గత ఐదేళ్లలో జగన్ ఇచ్చిన హామీలను సమర్థవంతంగా అమలు చేసినప్పుడు ఇదే బడ్జెట్ కదా.. మరి మీరు ఎందుకు అమలు చేయట్లేదంటూ కూటమి ప్రభుత్వాన్ని కొట్టు ప్రశ్నించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ

ప్రజలపై రూ.15 వేల కోట్ల విద్యుత్ భారాలు

విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పి రూ.15 వేల కోట్ల అధిక భారాన్ని ప్రజల నెత్తిపై చంద్రబాబు రుద్దారని మండిపడ్డారు. నేరుగా దాబాల్లోనే మద్యం అమ్మేస్తూ, ఎక్కడికక్కడ విచ్చలవిడిగా మద్యం అందిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వమే వీధివీధికి బెల్టు షాపులు ఏర్పాటు చేసి రూ.10 ఎక్కువ ధరకు అమ్ముతోందన్నారు. మందుబాబుల నుంచి కోట్లు దోచేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు అవినీతి పాలనకు పవన్ కల్యాణ్ తాళం వేస్తున్నారని దుయ్యబట్టారు.

పోలీసు వ్యవస్థ నీరుగారిపోయింది

న్యాయం కోసం పోలీసులను ప్రజలు ఆశ్రయిస్తే వారు కిమ్మనకుండా ఉండటం దారుణమన్నారు. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ నీరుగారిపోయినట్టుగా ఉందన్నారు. టీడీపీకి తాను ప్రాణం పోసినట్టు చెబుతున్న పవన్ కల్యాణ్ ప్రభుత్వంలో జరిగే వైఫల్యాలకు ఎందుకు బాధ్యత తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రోజుకో వేషం, రోజుకో నాటకం పవన్ కల్యాణ్ తీరని మాజీ మంత్రి కొట్టు విమర్శించారు.

క్రైస్తవుల శాంతి ర్యాలీ



పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర విచారణ చేసి, ఆయన కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ జంగారెడ్డిగూడెంలో భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. ఆదివారం మండల పాస్టర్లు, క్రైస్తవ సంఘాల సభ్యులు, ఫెలోషిప్ సభ్యులు జంగారెడ్డిగూడెం ఎంపీడీఓ కార్యాలయం నుంచి భారీ ప్రదర్శన నిర్వహించి, బోసుబొమ్మ సెంటర్‌లో మానవహారం ఏర్పాటుచేశారు. అక్కడి నుంచి ర్యాలీగా వెళ్లి ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందించారు.

–జంగారెడ్డిగూడెం

క్లుప్తంగా

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలి మృతి


సోమాలమ్మ, మృతురాలు

భీమవరం: భీమవరం పట్టణం విస్సాకోడేరు వంతెన సమీపంలోని రిలయన్స్ పెట్రోల్ బంక్ వద్ద సోమవారం గుర్తు తెలియన వాహనం ఢీకొని వీధి సోమాలమ్మ(80)మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని 38వ వార్డు లంకపేటకు చెందిన సోమాలమ్మ శనివారం ఇంటి నుంచి బయటకు వచ్చింది. సోమవారం రిలయన్స్ పెట్రోల్ బంకు వద్ద రోడ్డుపై గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతిచెందింది. వీఆర్ఓ టి.వెంకటలక్ష్మి పిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు వన్‌టౌన్ ఏఎస్ఐ కె.శ్రీనివాస్ చెప్పారు.

23 కేజీల పంచలోహ విగ్రహం బహూకరణ


అమ్మవారి పంచలోహ ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న దాతలు

పాలకొల్లు సెంట్రల్: శ్రీ ముఖధారమ్మ జాతర మహోత్సవాల సందర్భంగా సోమవారం దాతలు సింహాద్రి వీర బ్రహ్మం, భ్రమరాంబ దంపతులు అమ్మవారికి 23 కేజీలతో పంచలోహ ఉత్సవ విగ్రహం సమర్పించారు. ఉదయం సన్నాయి వాద్యాలతో విగ్రహాన్ని వీధిలో ఊరేగించిన తరువాత ఆలయానికి చేరుకుని పురోహితులు రవీంద్ర బ్రహ్మత్వంలో అమ్మవారికి అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ కమిటీ సభ్యులకు విగ్రహాన్ని అందజేశారు. ఉదయం ముఖధారమ్మకు చలివిడి, పానకం సమర్పించి అనంతరం పట్టణంలో ఉన్న అన్ని అమ్మవార్ల ఆలయాలకు వెళ్లి చలివిడి పానకం సమర్పించారు. రాత్రి యినకొండ చంటి కుటుంబ సభ్యులు అమ్మవారికి కుంభం ఏర్పాటుచేశారు. అనంతరం సన్నాయి వాద్యాలతో జాతర మహోత్సవం నిర్వహించారు.

కొట్లాటలో యువకుడి మృతి

వీరవాసరం: జాతరలో జరిగిన కొట్లాటలో యువకుడు మృతిచెందాడు. నందమూరి గరువు కోట సత్తెమ్మ జాతరలో జరిగిన కొట్లాటలో గ్రామానికి చెందిన కాసాని రాజేష్(16)కు తీవ్ర గాయాలవడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్సై రవికుమార్ సోమవారం తెలిపారు. జాతరలో కోబ్రా డ్యాన్స్ జరుగుతుండగా కొండచిలువపై జనాలు పడిపోవడంతో కమిటీ సభ్యులు వెనుకకు గెంటారు. ఇదే సమయంలో వెనుక ఉన్న మృతుడు కాసాని రాజేష్‌పై పడడంతో కమిటీ సభ్యులకు రాజేష్‌కు మధ్య వాగ్వాదం జరిగింది. ఇంతలో గ్రామానికి చెందిన మేకల సతీష్, మేకల రాహుల్ రాజేష్‌ను అడ్డగించి తీవ్రంగా గాయపరిచారు. వీరవాసరం పోలీసులకు సమాచారం అందడంతో వారు రాజేష్‌ను భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వీరవాసరం ఎస్సై తెలిపారు. కాసాని ఈ ఘటనలో గ్రామంలో విషాద చాయలు అలముకున్నాయి. తన కుమారుడిని కావాలనే హత్య చేశారని తల్లి దుర్గ, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

అడవిలో అమృతధార

- వేసవిలో వన్యప్రాణులకు భరోసా
- దాహార్తిని తీర్చేలా అటవీశాఖ అధికారులు ప్రత్యేక కృషి
- పాపికొండలు అభయారణ్యంలో 60 నీటితొట్టెలు


తొట్టెల్లో నీరు తాగుతున్న వన్యప్రాణులు


అడవిలో ఏర్పాటు చేసిన నీటి తొట్టెలను పరిశీలిస్తున్న అటవీ అధికారులు

బుట్టాయగూడెం: వేసవిలో వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు అటవీశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. గత రెండేళ్లుగా వన్యప్రాణి సంరక్షణ కోసం అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన నీటి తొట్టెలు సత్ఫలితాలనిస్తున్నాయి. గతంలో వేసవిలో నీటి కోసం పలు రకాల వన్యప్రాణులు అటవీ పరిసర ప్రాంతాల్లోని జనావాసాల్లోకి వచ్చేవి. ఆ సమయంలో పలు వన్యప్రాణులు కుక్కల బారిన లేదా వాహనాల కింద పడి మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అటవీశాఖ అధికారులు వన్యప్రాణులు సంచరించే ప్రాంతాల్లో నీటితొట్టెలు ఏర్పాటు చేసి వాటి దాహార్తి తీర్చేలా కృషి చేస్తున్నారు.

60 నీటి కుంటల ఏర్పాటు

పాపికొండల అభయారణ్యం పరిసర ప్రాంతాల్లో వన్యప్రాణులకు వేసవిలో దాహార్తిని తీర్చేలా సుమారు 60 నీటితొట్టెలు ఏర్పాటు చేసినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. వీటితో పాటు అటవీ ప్రాంతంలోని కాల్వల్లోని 20 చలమలను తీసి, వన్యప్రాణులకు నీటి సౌకర్యం లభించేలా చర్యలు తీసుకున్నారు. 25 చెక్‌డ్యామ్‌ల ద్వారా నీటిని నిల్వ ఉంచేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా నీటి తొట్టెల్లో వేసవిలో నాలుగు రోజులకు ఒకసారి ట్యాంకర్ల ద్వారా బేస్‌క్యాంప్ సిబ్బంది, బీట్ అధికారులు నీటిని తీసుకొచ్చి నింపుతున్నారు. వాహనాల్లో వెళ్ళలేని నీటి తొట్టెల వద్దకు బేస్‌క్యాంప్ సిబ్బంది వెళ్లి నింపుతారు. పక్కన ఉప్పు ముద్దలను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు చెప్తున్నారు. నీటి కోసం వచ్చిన వన్యప్రాణులు దాహార్తిని తీర్చుకుని ఉప్పు ముద్దను నాకుతాయని దీంతో వడదెబ్బ బారి నుంచి కాపాడుకునే అవకాశాలు ఉంటాయని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు.

కొన్నేళ్లుగా పెరిగిన వన్యప్రాణుల సంఖ్య

1,12,500 లక్షల హెక్టార్లలో పాపి కొండల అభయారణ్యం విస్తరించి ఉంది. పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో పాపికొండల అభయారణ్యం పరిధిలో ఉన్న బుట్టాయగూడెం, పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల కదలికలు ఎక్కువగా ఉన్నాయి. వైల్డ్ వైఫ్ అధికారులు ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాలకు చిక్కుతున్నాయి. వాటి సంరక్షణకు అటవీశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు, పాపికొండల అభయారణ్యంలో ఎలుగు బంట్లు, కొండ గొర్రెలు, జింకలు, కొండచిలువలు, అడవి పందులు, చిరుతలు, ముళ్ల పందులు, నక్కలు, దున్నలు వంటి అనేక జంతులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వేసవిలో దాహార్తి తీర్చేలా తగు చర్యలు తీసుకుంటున్నారు.

కవిటం బాలలకు భరతనాట్యం అవార్డు


రాజమండ్రిలో అవార్డు అందుకున్న కవిటం బాలికలు

పోడూరు: ఉగాది మహోత్సవంలో భాగంగా రాజమండ్రిలోని ఆనం కళాకేంద్రంలో సోమవారం బాలలకు నిర్వహించిన భారతీయ నృత్యోత్సవం -2025లో కవిటం గ్రామానికి రేమెళ్ల మనోజ్ఞ, ఇళ్ల జాహ్నవి, సత్తి హరినాగశ్రీ, వీరవల్లి యశస్విని భరతనాట్యంలో అద్భుత ప్రదర్శన చేసి ఆహుతులను మెప్పించారు. నృత్యప్రదర్శన చేసిన కవిటం బాలికలకు నిర్వాహకులు నర్తన వసంత కుసుమం అవార్డు ప్రదానం చేసి సత్కరించారు. ఈ సందర్భంగా నృత్యప్రదర్శన చేసిన మనోజ్ఞ, జాహ్నవి, హరి నాగశ్రీ, యశస్విని, పెనుగొండకు చెందిన శ్రీ వెంకటేశ్వర నృత్య నాట్య కళాశాలకు చెందిన నాట్యాచార్యులు కె.వినయ్‌కృష్ణను కవిటం గ్రామ ప్రముఖులు అభినందించారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ జరపాలి


వెంపలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


తాడేపల్లిగూడెంలో ర్యాలీ చేస్తున్న క్రైస్తవ జేఏసీ నాయకులు

భీమవరం అర్బన్: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర విచారణ చేయాలని పాస్టర్లు వర్ధనపు లాబాను, ప్రసన్నకుమార్, డెలిగేట్లు టి.విజయ బాబు, బి.భాగ్యానందం, బి.సునీల్, పి.చిట్టిబాబు డిమాండ్ చేశారు. భీమవరం మండలంలోని వెంపలో పెదపేటలో అంబేద్కర్ విగ్రహం నుంచి బస్టాండ్ వరకు సోమవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై ప్రజలు అనేక అనుమానాలతో ఉన్నారని ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దళితులు, క్రైస్తవులు, మైనారిటీలపై దాడులను అరికట్టాలన్నారు. సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు ఇంజేటి శ్రీనివాస్ శాంతి ర్యాలీకి మద్దతు ప్రకటించి మాట్లాడారు. కార్యక్రమంలో ఇంజేటి జయమణి, ప్రభాకర్‌రావు, బల్ల సుబ్బారావు, కడిమి పాల్ రాజు, పట్టే చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో..

పెంటపాడు: పాస్టర్ పగడాల అకస్మిక మృతిపై ప్రభుత్వం తక్షణం న్యాయ విచారణ జరిపి, దోషులపై చర్యలు తీసుకోవాలని గూడెం క్రైస్తవ జేఏసీ నేతలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం గూడెంలోని పలు డినామినేషన్‌లకు చెందిన క్రైస్తవులు, దైవసేవకులు, మ్యూజిక్ టీం సభ్యులు, క్రైస్తవ గాయకులు గూడెం క్రైస్తవ జేఏసీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ ప్రవీణ్ పగడాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జేఏసీ సభ్యులు మాట్లాడుతూ నిజాలు నిగ్గు తేల్చి తక్షణం దోషులపై చర్యలు తీసుకోవాలన్నారు. క్రైస్తవులపై ఇటీవల దాడులు పెరిగిపోయాయనడానికి ఈ ఉదంతమే కారణమన్నారు. శిలువ శ్రమల 40 దినాలలో ఉన్న క్రైస్తవ బోధకులు, విశ్వాసులు అహర్నిశం దేశం కోసం ఎన్నో ప్రార్థనలు చేస్తున్నార న్నారు. జేఏసీ నాయకులు మానుకొండ డల్లా, మరనాత ఎలీషా, పాస్టర్ రవికుమార్, శామ్యూల్ మాస్టార్, బేబీ సరోజిని, లాల్ నెహ్రూ, మెండెం జేమ్సు, పాస్టర్ వినోద్, టైటస్, ప్రసాద్, పాస్టర్ ఎజ్రా శాస్త్రి, దినకరన్ తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన చికెన్ ధరలు



భీమవరం: చికెన్ ధరలు భారీగా పెరిగాయి. ప్రస్తుతం కిలో రూ.260 నుంచి రూ.280 వరకు విక్రయిస్తున్నారు. గత వారంలో కిలో రూ.180 నుంచి రూ.200 వరకు విక్రయించారు. ఫిబ్రవరిలో బర్డ్‌ఫ్లూ కారణంగా కోళ్ల గణనీయంగా చనిపోవడంతో అనేక కోళ్లఫారాలు ఖాళీ అయ్యాయి. ఇదే సమయంలో బర్డ్‌ఫ్లూ సోకిన కోళ్ల మాంసం తినకూడదంటూ ప్రభుత్వం ప్రచారం చేయడంతో జిల్లాలో కోడి మాంసం విక్రయాలు దాదాపుగా నిలిచిపోయాయి. బర్డ్ ఫ్లూ తగ్గినప్పటికీ మాంసం తినడానికి భయపడ్డారు. దీంతో కోళ్లఫారాల యజమానులు, చికెన్ విక్రయదారులు ఫిబ్రవరి నెలాఖరు, మార్చినెలలో జిల్లాలోని భీమవరం, తణుకు, పాలకొల్లు వంటి పట్టణాల్లో చికెన్, ఎగ్ మేళాలు నిర్వహించి ఉచితంగా చికెన్‌తో తయారుచేసిన వివిధ వంటకాలు ఉచితంగా అందించారు. మార్చి నెలాఖరు వరకు వినియోగదారులు చికెన్ తినడానికి పెద్దగా ఆసక్తి చూపించలేదు. అయితే ఉగాది సందర్భంగా చికెన్ అమ్మకాలు జోరందుకున్నాయి. దీనితో ధర అమాంతం పెంచారు. ఫారం యజమానులే బాయిలర్ కోడిని కిలో రూ.135కు విక్రయిస్తున్నారని అందువల్లే చికెన్ స్కిన్‌లెస్ రూ.280కి విక్రయించాల్సి వస్తుందని చికెన్ వ్యాపారులు చెబుతున్నారు. గత మూడు రోజుల్లోనే ధర కిలోకు రూ.60 పెరిగినట్లు చెబుతున్నారు. కోళ్లఫారాల్లో బర్డ్‌ఫ్లూ కారణంగా కోళ్ల పెంపకం లేకపోవడంతో కొరత ఏర్పడి ధరలు పెరిగినట్లు చెబుతున్నారు.

కల్యాణ ముహూర్తాలు ప్రారంభం


రేపల్లెవాడలో ముస్తాబైన కల్యాణ మండపం

కొయ్యలగూడెం: పెళ్లికళ వచ్చేసిందే బాలా అంటూ వధూవరులు బంధుమిత్రులు వేడుకలు చేసుకునే సమయం వచ్చేసింది. ఏప్రిల్‌లో శుభ లగ్నాలతో కూడిన తొమ్మిది పెళ్లి ముహూర్తాలు ఉన్నాయని పండితులు చెబుతున్నారు. విశ్వావసు నామ సంవత్సర చైత్ర మాసం ప్రారంభమైన నేపథ్యంలో ఒకటో తేదీ నుంచి పదమూడో తేదీ వరకు మూఢం ఉందని చెబుతున్నారు. అనంతరం 14, 16, 18, 19, 20, 21, 25, 29, 30 తేదీలు ముహూర్తాలకు శుభప్రదమైనవి. ఈ నేపథ్యంలో కల్యాణ మండపాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. కొన్ని ఆలయాల వద్ద నిర్మించిన కల్యాణ మండపాలలో ఏప్రిల్ ఆరు నుంచి శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కళ్యాణం, అనంతరం ఉత్సవాలు కూడా నిర్వహించనున్నారు. పురోహితులు అడ్వాన్స్ బుకింగ్ అవ్వగా, ఈవెంట్ బుకింగ్ మేనేజర్లు కల్యాణ ఏర్పాట్లకు సంబంధించి తల మునకలై ఉన్నారు. టిప్ టాప్ మొదలుకుని భాజా భజంత్రీలు.. కళ్యాణానికి సంబంధించిన వారు అందరూ తమ షెడ్యూల్ రూపొందించుకుంటున్నారు. సంవత్సరంలో ఒకే నెలలో ఇన్ని ముహూర్తాలు రావడం ఇదే మొదటిదని పండితులు అంటున్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

తాడేపల్లిగూడెం అర్బన్: బాలికను లైంగికంగా వేధిస్తున్న యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై పి.నాగరాజు సోమవారం తెలిపారు. స్థానిక యాగర్లపల్లి వద్ద ఇటుకుల బట్టీలో పని చేసేందుకు ఒక కుటుంబం వేరే ప్రాంతం నుంచి తాడేపల్లిగూడెం వచ్చింది. ఆ కుటుంబానికి చెందిన బాలికను ఆదివారం రాత్రి ఎం.నాగబాబు అనే యువకుడు మాయ మాటలు చెప్పి సమీపంలో ఉన్న పొదల్లోకి తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక గట్టిగా అరవడంతో బాలిక తండ్రి వచ్చేసరికి నాగబాబు అక్కడి నుంచి పారిపోయాడు. బాలిక తండ్రి స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సోమవారం నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు.

పక్కకు ఒరిగిన మూలవిరాట్ విగ్రహం

రుస్తుంబాద జగన్నాథస్వామి ఆలయంలో అపశృతి


ఆలయంలో జగన్నాథస్వామి విగ్రహం తలభాగం ఒరిగినట్టు ఉన్న దృశ్యం

నరసాపురం: నరసాపురం రుస్తుంబాదలోని చారిత్రక జగన్నాథస్వామి ఆలయంలో ఓ అపశృతి సోమవారం వెలుగులోకి వచ్చింది. ఆలయంలోని మూల విరాట్ విగ్రహం కాస్త పక్కకు ఒరిగింది. ఈ ఆలయంలో పూరీ తరహాలో జగన్నాథ, బలరామ, సుభద్రా దేవి కొలువైఉన్నారు. దాదాపు 600 సంవత్సరాలు చరిత్ర ఈ ఆలయానికి ఉంది. కొన్ని సంవత్సరాలుగా దేవదాయ శాఖ నిర్లక్ష్యం వల్ల ఆలయ నిర్వహణ కుంటుపడింది. ఆలయ అధికారుల నిర్లక్ష్యమే ప్రస్తుతం మూలవిరాట్ జగన్నాథ స్వామి విగ్రహం పక్కకు ఒరగడానికి కారణమని భక్తులు ఆరోపిస్తున్నారు. ఉదయం ఆలయం తెరిచిన తరువాత పూజ సమయంలో ఎడమ పక్కన ఉన్న జగన్నాథస్వామి విగ్రహం పక్కకు ఒరిగినట్టుగా ఓ భక్తుడు గుర్తించాడు. స్థానికులు కొందరు ఆలయం వద్ద వచ్చి ఇన్‌చార్జ్ ఆలయ ఈవో లోకేష్‌కు ఫిర్యాదు చేసి ఆందోళన చేశారు. పూరిలోని ప్రఖ్యాత జగన్నాథస్వామి ఆలయంలోని విగ్రహాల మాదిరిగానే ఇక్కడ కూడా చెక్క విగ్రహాలను 600 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసినట్లు చెబుతున్నారు .డచ్, బ్రిటీష్ హయాంలోను, మొగల్తూరు కోట రాజవంశీయుల పాలనలోను ఈ ఆలయం ఓ వెలుగు వెలిగింది. పూర్వం నుంచి భక్తులు అనేక ఎకరాల భూములు ఈ ఆలయ నిర్వహణకు దానంగా ఇచ్చారు. ఆలయ నిర్వహణను మాత్రం దేవ దాయశాఖ గాలికి వదిలేసింది. అసలు ఆలయం విగ్రహం చాలా కాలం క్రితమే పక్కకు ఒరిగి ఉంటుందని, ఆలయ అధికారుల నిర్లక్ష్యంతో విషయం బయటకు రాలేదని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అసలు ఆలయ అధికారులు ఈ విషయాన్ని కనీసం ఇప్పటివరకూ గుర్తించలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

భర్తపై అలిగి భార్య అదృశ్యం

నరసాపురం: ఇంటి ఓనర్‌తో గొడవపడిందని భర్త మందలించడంతో భార్య అలిగి కొడుకును తీసుకుని వెళ్లిపోయింది ఓ మహిళ. నరసాపురం టౌన్ ఏఎస్సై జి.నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. 14వ వార్డుకు చెందిన దొండపాటి శాంతకుమారి ఈ నెల 27న ఇంటి ఓనర్‌తో గొడవపడింది. శాంతకుమారి భర్త చిట్టిబాబు భార్యను మందలించాడు. దీంతో శాంతకుమారి కొడుకుని తీసుకుని ఎక్కడికో వెళ్లిపోయింది. బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో వాకబు చేసినా దొరకకపోవడంతో సోమవారం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

వక్ఫ్ సవరణకు వ్యతిరేకంగా ఓటేయాలి



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎండీ ఇస్మాయిల్ షరీఫ్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కేంద్ర ప్రభుత్వం నిరంకుశంగా చేపట్టనున్న వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ సోమవారం ఏలూరు తంగెళ్ళమూడి వంతెన వద్ద ముస్లింలు నల్ల బ్యాడ్జీలు ధరించి జాతీయ జెండా చేపట్టి నిరసన కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఈదుల్ ఫితర్ పండుగ నమాజ్ అనంతరం మసీదుల నుంచి ర్యాలీగా బయలుదేరి వంతెన వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు ఎండీ ఇస్మాయిల్ షరీఫ్, ఎండీ ఇలియాజ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగానికి వ్యతిరేకంగా నడుచుకుంటుందన్నారు. ముస్లింల వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులకు స్థానం కల్పించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వారి బోర్డుల్లో ముస్లింలకు కూడా స్థానం కల్పిస్తారా అని నిలదీశారు. ఎవరికి కేటాయించిన సంస్థల్లో వారు ఉంటే ఆ సంస్థలకు, దేశానికి కూడా మేలు జరుగుతుందన్నారు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసెంబ్లీలో తీర్మానం చేయించి కేంద్రానికి పంపాలన్నారు. కూటమి ఎంపీలతో బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేసే విధంగా ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కూటమిలో ఉన్న పార్టీలు ముస్లిం సమాజానికి ద్రోహం చేశారని భావించి భవిష్యత్తులో తగిన బుద్ధి కలిగేలా చర్యలు చేపడతామన్నారు. జమాతే ఇస్లామీ హింద్ నాయకుడు ఎండీ ముజాహిద్, అహలెసున్నత్ వల్ జమాత్ నాయకుడు ఎస్‌కే పాషా, అంజుమన్ ముహాఫిజుల్ ఇస్లాం ప్రతినిధులు, ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బకాయిల చెల్లింపునకు రోడ్ మ్యాప్ ప్రకటించాలి


ఫ్యాప్టో జిల్లా స్థాయి సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలోని 12 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు 11వ పీఆర్‌సీ, డీఏ, సరెండర్ లీవ్, సీపీఎస్ ఉద్యోగుల బకాయిలతో కలిపి రూ.23 వేల కోట్ల నిధులు చెల్లించాల్సి ఉందని ఫ్యాప్టో జిల్లా చైర్మన్ గుగులోతు మోహన్‌రావు అన్నారు. ఈ బకాయిల చెల్లింపుకు తక్షణమే రోడ్ మ్యాప్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎస్‌టీయూ కార్యాలయంలో సోమవారం సాయంత్రం జరిగిన జిల్లా స్థాయి ఫ్యాప్టో సమావేశంలో చైర్మన్ మోహన్‌రావు మాట్లాడుతూ 2024 జనవరి నుంచి ఇప్పటి వరకు మూడు విడతల డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని గుర్తు చేశారు. సీపీఎస్, జీపీఎస్ స్థానంలో మెరుగైన పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఇంతవరకు అమలు చేయలేదన్నారు. 2004 సెప్టెంబర్ 1కి ముందు నియామక ప్రక్రియ ప్రారంభమైన వారిని పాత పింఛన్‌లోకి తీసుకోవచ్చని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమోని సైతం అమలు చేయని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించి పర్యవేక్షణాధికారి పోస్టులను భర్తీ చేసి ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. 12వ పీఆర్‌సీ కమిషన్‌ను వెంటనే నియమించాలని, 30 శాతం ఐఆర్ ప్రకటించాలని కోరారు. ఇలాంటి విషయాల్లో ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఏప్రిల్ రెండో తేదీన మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే నిరసన కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఫ్యాప్టో జిల్లా సెక్రటరీ జనరల్ ఎం.ఆదినారాయణ, కో చైర్మన్‌లు జీ వెంకటేశ్వరరావు, జీ ప్రకాశరావు, డిప్యూటీ సెక్రటరీ జనరల్‌లు ఎం.శామ్యూల్, ఈసీ సభ్యులు ముస్తఫా అలీ, కె.ఆర్.పవన్ కుమార్, ఎం.శ్రీనివాసరావు, రాష్ట్ర ఫ్యాప్టో కో చైర్మన్ బీ మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వెంకట్రావు కుటుంబానికి కొట్టు పరామర్శ



వీరవెంకట్రావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన ర్యాలీ వీరవెంకట్రావు ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా వారి కుటుంబాన్ని మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ పరామర్శించారు. వెంకట్రావు మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. తొలుత వెంకట్రావు చిత్రపటం వద్ద మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ నివాళులర్పించారు. ఆయన వెంట ఏఎంసీ మాజీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, బొద్దాని శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

బలుసులమ్మకు విశేష పూజలు



విశేష అలంకరణలో బలుసులమ్మ అమ్మవారు

తాడేపల్లిగూడెం (టీఓసీ): విశ్వావసు నామ సంవత్సర ఉగాది సందర్భంగా పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ అమ్మవారి ఆలయం వద్ద సోమవారం అమ్మవారికి విశేష పూజలు జరిగాయి. వివిధ రకాల పుష్పాలతో, పండ్లతో అమ్మవారికి విశేష అలంకరణలు గావించారు. మహన్యాసపూర్వక పంచామృత సుగంధ ద్రవ్య వివిధ నదీనదజలాలతో విశేష అష్టమూర్తి రుద్రాభిషేకం జరిగింది. రాత్రి దీపోత్సవం నిర్వహించారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు శ్రీరంగం అంజిబాబు విశేష పూజలలో పాల్గొన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

అలరించిన విద్యార్థుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు



మదనగోపాలస్వామి కళావేదికపై ఉగాది సందర్భంగా నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

అత్తిలి: మండలంలోని బల్లిపాడు గ్రామంలో మదనగోపాలస్వామి ఆలయంలో ఉగాది వేడుకలను సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. స్వామివారి కళావేదికపై గ్రామానికి చెందిన మదనగోపాల్ స్కూల్ విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. విద్యార్థులు ప్రదర్శించిన జానపద, వెస్టర్న్, పోక్ డ్యాన్సులతో పాటు కరాటే, కర్రసాము విన్యాసాలు ప్రేక్షకులను అలరించాయి. కార్యక్రమంలో ఆలయ ఈవో ఎల్ లోకనాథ్ శ్రీనివాస్, పాఠశాల డైరెక్టర్ తిరుపతి శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు ఎన్ శివకృష్ణ, ప్రిన్సిపాల్ నీలం అనిత, వైస్ ప్రిన్సిపాల్ కుమారి, టి గీతాభారతి, ప్రధానోపాధ్యాయుడు బాడిగ నాగేశ్వరరావు, ఇన్‌చార్జి ఆకుల శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భారత్ లౌకిక రాజ్యం



ములపర్రు మసీదుకు క్లాత్ అందించిన మాలమహానాడు నాయకులు

పెనుగొండ: భారత దేశం అన్ని మతాలకు సమ ప్రాధాన్యం ఇచ్చే లౌకిక రాజ్యమని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్ అన్నారు. మాల మహానాడు ఆచంట మండల అధ్యక్షుడు రావి నాగరాజు సహకారంతో ములపర్రు మసీదుకు క్లాత్ అందించారు. కార్యక్రమంలోజిల్లా అధ్యక్షుడు గుండే నగేష్‌బాబు జిల్లా ఉపాధ్యక్షుడు సరెళ్ల శ్రీనివాస్, పెనుగొండ మండల అధ్యక్షుడు చికిలే కృష్ణబాబు, ఉపాధ్యక్షుడు రొక్కాల విజయగాంధీ, తండా ఇషాకు రాజుచ కేసరపల్లి నాగేశ్వరరావు, కేసరపల్లి గిరి, అరిగెల పుల్లారావు, చిల్లే సురేష్, బోళ్ల ప్రసాద్, రావి వెంకటేశ్వరరావు, పినిపే జ్యోతి బాబు, నేలపూడి వరద రాజు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో రూ.10 లక్షల ఆస్తి నష్టం

నరసాపురం: పట్టణంలోని 14వ వార్డు గోదావరి గట్టు కొండాలమ్మ గుడి ప్రాంతంలో కారిచర్ల శివ అనే యువకుడు నడుపుతున్న సోఫా తయారీ షాపులో అగ్ని ప్రమాదం జరిగింది. ప్రమాదంలో సోఫాల తయారీకి ఉపయోగించే కొబ్బరి పీచు, పలు రకాల ఫోంలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఉదయం 10 గంటల ప్రాంతంలో షాపు తాళం వేసి ఉండగా లోపల నుంచి మంటలు రావడాన్ని గమనించి స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. రెండు ఫైరింజన్లు వచ్చి మంటలు అదుపు చేశాయి. మంటలు పక్కనున్న మరో నివాస భవనానికి కూడా వ్యాపించబోయాయి. అయితే సకాలంలో ఫైరింజన్లు రావడంతో ప్రమాదం తప్పింది. సుమారు రూ.10 లక్షల ఆస్తి నష్టం సంభవించిందని అగ్నిమాపక శాఖ అధికారులు చెప్పారు.

ఈ తణుకుకు ఏమైంది?

- గతంలో ప్రశాంతతకు మారుపేరుగా తణుకు
- నేడు నిరసనలు.. దాడులు.. జూదాలు.. చోరీలు..
- రాష్ట్ర వ్యాప్తంగా హల్‌చల్ చేస్తున్న తణుకు
- గతంలో ఇలా లేదంటున్న తణుకువాసులు



వేల్పూరులో ఒక వ్యక్తి అనుమానాస్పద మృతిపై మద్యం దుకాణం వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు (ఫైల్)

తణుకు అర్బన్: ప్రశాంతతకు మారుపేరుగా, పారిశ్రామికంగా దినదినాభివృద్ధి చెందుతూ ఉండే తణుకు పట్టణం మాయని మరకలు అంటుతున్నాయి. ఒకప్పుడు తణుకు అంటే చెరకు నుంచి పంచదారను ఉత్పత్తి చేసే ఆంధ్రా సుగర్స్, పేదలకు ఉపాధి కల్పించే విధంగా స్పిన్నింగ్, హెయిర్ ఇండస్ట్రీ వంటి పరిశ్రమలు గుర్తొచ్చే పరిస్థితి ఉండేది. కానీ నేడు అసాంఘిక కార్యకలాపాలు, అక్రమాలు, అన్యాయాలు, దాడులు, నిరసనలు, చోరీలకు ప్రధాన కేంద్రంగా పేరుగాంచింది. ఏ వార్త బయటకు వచ్చినా అందుకు మూలాలు తణుకుకే అంటుకోవడం బాధాకరంగా తణుకువాసులు భావిస్తున్నారు.

కూటమి ప్రభుత్వం వచ్చాక నేరాలు.. ఘోరాలు

గత ఐదేళ్ల ప్రశాంతతకు మారుపేరుగా ఉన్న తణుకు ప్రాంతం నేడు నేరాలు.. ఘోరాలను చవిచూడాల్సిన దుస్థితి నెలకొందని ప్రజానీకం అంటున్నారు. ముఖ్యంగా ఈ కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం తణుకు పట్టణానికి పట్టిన ప్రధాన సమస్యగా పశువులను హింసించి చంపేటటువంటి కర్మాగారం కార్యకలాపాలు ప్రారంభించడంతో స్థానిక ప్రజానీకం ఇబ్బందులు పడుతూ రోడ్డెక్కడం, మహిళలు పోలీస్‌స్టేషన్ వద్ద బైఠాయించడం, ఇళ్లలో ఉండలేకపోతున్నామంటూ సదరు కర్మాగారం వద్ద శిబిరం ఏర్పాటు చేసుకుని వంట వార్పుచేయడంతో ఇళ్లలో గుట్టుగా సంసారాలు చేసుకునే మహిళామణులు సైతం రోడ్డుపైకి రావాల్సిన దుస్థితి. తణుకు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో వీఆర్‌లో ఉన్న ఒక ఎస్సై స్టేషన్‌లో సర్వీసు రివాల్వరుతో కాల్చుకోవడం ఆపై ఆరోపణలు ఉన్నప్పటికీ సదరు ఘటనపై ఎవరినీ బాధ్యులుగా చేయకుండా పోలీసు ఉన్నతాధికారులు కిమ్మనకుండా ఉండడం కూడా ఆశ్చర్యాన్ని కొలిపే విధంగా ఉంది. మహిళలపై కూటమి నేతలు అమానుష ప్రవర్తనలు సైతం ఇటీవల కాలంలో తణుకులో చోటుచేసుకోవడం గమనార్హం.

శాంతి భద్రతలు క్షీణించాయి ?

ముఖ్యంగా శాంతి భద్రతలు క్షీణించి మద్యం దుకాణాలు విచ్చలవిడిగా చేస్తున్న అమ్మకాలతో అర్ధరాత్రి సమయంలో దాడులు, తణుకు నియోజకవర్గం అంతా పేకాట స్థావరాలు ఏర్పాటుచేయడం, కోడి పందాలకు నిలయంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇసుప రాడ్లతో దాడులు తెరతీయడం, కత్తులు, బ్లేడులతో పీకలు చీరేయడం వంటి ఘటనలు చోటుచేసుకోవడం దురదృష్టకరం. ఇక ఆరుగాలం కష్టించి పోగుచేసుకున్న సొత్తును దొంగలు లూటీ చేసుకుపోవడం, సదరు చోరీలపై ఎటువంటి పురోగతి లేకపోవడంతో బాధితులు సైతం గొల్లుమంటున్నారు. అంతేకాకుండా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే విధంగా ఇటీవల అత్తిలిలో నిర్వహించిన ఎంపీపీ ఉప ఎన్నికకు సంబంధించి కూటమి నాయకులు ఏకంగా మాజీమంత్రి నివాసంపై దాడికి దిగడం, ఎంపీటీసీ సభ్యులను ఎన్నిక కేంద్రానికి రాకుండా అడ్డుకున్నా పోలీసులు చూసీచూడనట్లుగా వ్యవహరించడం వంటి పరిణామాలు ప్రశాంతమైన తణుకు ప్రాంతానికి మరకలు అంటిస్తున్నాయి.

ఘనంగా దుర్గమ్మ కల్యాణ ఉత్సవం



దుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

పెంటపాడు: మండలంలోని బి. కొండేపాడు గ్రామ ఇలవేల్పు కనకదుర్గమ్మ ఉత్సవాలు ఉగాది పురస్కరించుకొని వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సోమవారం రాత్రి కనకదుర్గమ్మ కల్యాణ ఉత్సవాన్ని గ్రామస్తులు, ఆలయకమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు తల్లా ప్రగడ వంశీకులు ఈ కల్యాణతంతును నిర్వహించారు. పలు గ్రామాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో శోభనాద్రి, తల్లాప్రగడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు

తణుకు అర్బన్: కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దుచేసి కార్మికులకు వ్యతిరేకంగా బడా పెట్టుబడిదారులకు అనుకూలంగా నరేంద్రమోదీ ప్రభుత్వం ఆమోదించిన నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు కోరుతూ మే 20వ తేదీన కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరుపతలపెట్టిన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలని తణుకు ఏపీ సీడ్స్ హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు పిలుపునిచ్చారు. సోమవారం తణుకు వంక సత్యనారాయణ సురాజ్యభవన్ నందు జరిగిన ఏపీ సీడ్స్ హమాలీ వర్కర్స్ యూనియన్ సమావేశానికి భీమారావు అధ్యక్షత వహించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికులను కట్టు బానిసలను చేయడమే కాకుండా జీవించే హక్కును హరింప చేసే విధంగా ఉన్నాయని స్పష్టంచేశారు. దినానికి 8 గంటల స్థానంలో 10 గంటలు పెట్టడం, యూనియన్‌లు పెట్టుకునే హక్కు నిరాకరించడం, కనీస వేతనాలు అడిగే హక్కు లేకుండా చేయడం లాంటి కార్మిక వ్యతిరేక విధానాలు లేబర్ కోడ్‌ల ద్వారా అమలుకు పూనుకోవడం కార్మికవర్గానికి తీరని ద్రోహం తలపెట్టడం తప్ప మరొకటి కాదన్నారు. దేశంలో సుమారు 60కోట్ల మంది కార్మికుల ప్రయోజనాలకు విరుద్ధంగా కార్మిక చట్టాలు తొలగించి లేబర్ కోడ్‌లు తేవడాన్ని వ్యతిరేకిస్తూ తలపెట్టిన దేశ వ్యాపిత సార్వత్రిక సమ్మె విజయవంతానికి అందరూ కృషి చేయాలని భీమారావు కోరారు. ఏపీ సీడ్స్ హమాలీ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి సావారపు దేవీ, పిండి సత్యవతి, పట్టపు కృష్ణవేణి పాల్గొన్నారు.

బీవీఆర్‌లో ఘనంగా ఉగాది నాటిక పోటీలు



చిన్నారుల నృత్యప్రదర్శన

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని బీవీఆర్ కళాకేంద్రంలో అధ్యక్షుడు బుద్దాల వెంకట రామారావు ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ఉగాది నాటిక పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సర్జన్ డాక్టర్ ఉన్నమట్ల రాజేష్ నాటిక పోటీలను ప్రారంభించారు. జాతీయ నాటికలలో భాగంగా తొలిరోజు రెండు నాటికలను ప్రదర్శించారు. భారతీయ వైవాహిక వ్యవస్థ వాటి గొప్పతనం ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిన అంశాన్ని 'సారీ రాంగ్ నెంబర్' నాటికలో అద్భుతంగా ఆవిష్కరించారు. ఏలూరు హేలాపురి కల్చర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహమ్మద్ ఖాజావలి దర్శకత్వంలో చింతల మల్లేశ్వరరావు రచన చేపట్టిన ఈ నాటిక బాగా ఆకట్టుకుంది. తండ్రి కొడుకులు పాత్రలు పోటీపడి నటించారు. భార్యభర్తల అనుబంధము, వివాహ వ్యవస్థ గొప్పతనం, భారతీయ సంస్కృతి విలువలు ఈ నాటికలో అద్దంపట్టాయి. మరో నాటికలో హైదరబాద్ విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'స్వేచ్ఛ' నాటికను ప్రదర్శించారు. పీఎస్ నారాయణ మూల కథ ఆధారంగా పరమాత్ముని శివరాం నాటకీకరణతో బీఎం రెడ్డి దర్శకత్వంలో ఈ నాటికను ప్రదర్శించారు. కడియాల పరశురామయ్య, కొడవటిగంటి వెంకట నరసింహాచార్యులు ఈ నాటికల ప్రదర్శనకు సహకారాన్ని అందించారు. చిన్నారులు నృత్యాలను ప్రదర్శించారు.

అర్హులకు కార్పొరేషన్ రుణాలు ఇవ్వాలి

నరసాపురం రూరల్: అర్హులైన కాపు కాపు సోదరులకు కార్పొరేషన్ ద్వారా రుణాలు అందించాలని వైఎస్ పాలెం మాజీ సర్పంచ్ కూనపరెడ్డి వీరవెంకట విజయరంగారావు అన్నారు. సోమవారం రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడును ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వ ఏర్పాటులో కాపు సామాజిక వర్గం ప్రధాన పాత్ర పోషించిందని రంగారావు పేర్కొన్నారు. అయితే రాష్ట్రంలో కాపు సామాజిక వర్గం ఆర్థికంగా వెనుకబడిఉందన్నారు. కాపుల్లో ఆర్థికంగా వెనుకబడిన పేదలకు రుణాలు మంజూరు చేసి ఇప్పించాలని రంగారావును కోరినట్లు తెలిపారు.

హామీల అమలుపై చిత్తశుద్ధి లేదు

పెనుమంట్ర: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజలకు మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చి ఏడాది దగ్గర పడుతున్నా ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని పెనుమంట్ర జెడ్పీటీసీ సోమవారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. చంద్రబాబు మోసపూరిత హామీలు నమ్మి మోసపోయిన ప్రజలు ఆ హామీలను చిత్తశుద్ధితో అమలు చేయాలని కోరుతున్నారు. ఉపాధ్యాయుల నియామకంపై మొదటి సంతకం చేస్తానని ప్రగల్భాలు పలికిన చంద్రబాబు, మెగా డీఎస్సీని కుంటిసాకులతో అటకెక్కించారని, బాబు మాయమాటలు నమ్మి నిరుద్యోగులు ఇప్పుడు ఆర్థికంగా, మానసికంగా నలిగిపోతున్నారని హామీలు ఇచ్చిన పథకాలు అమలు చేయడానికి కమిటీలు వేయాలంటూ సంక్రాంతి, ఉగాది, దసరాలలో అమలు చేస్తామంటూ ప్రజలను మోసం చేస్తూ వస్తున్నారని, అది ఏసంవత్సరమో తెలియజేయకుండా పండుగల పేరు చెప్పి పబ్బం గడుపుతున్నారని ఆమె విమర్శించారు. ఉచిత బస్సు, ఉచిత ఇసుక అటకెక్కిందనిఅన్నారు. రూ.10 వేలు జీతం ఇస్తానని వలంటీర్లను నమ్మించి నిలువునా మోసం చేశాడని, అమ్మఒడి డబ్బులు వేయకపోవడం వల్ల ఎంతో మంది తల్లులు తీవ్రంగా నష్టపోతున్నారని. మూలన ఉన్న ములసమ్మ కూడా బటన్ నొక్కుతుందని, గత పాలనలో జగనన్నను ఎద్దేవా చేసిన చంద్రబాబుకు ఇప్పుడు ఆ బటన్ నొక్కడం కూడా చేతకావడం లేదన్నారు.

దుర్గమ్మకు మహా కుంభం



అఖండ అన్నసమారాధనలో పాల్గొన్న మహిళలు

ఆకివీడు: స్థానిక జవహర్ పేటలోని దుంపగడప రైల్వే గేటు వద్ద కనక దుర్గమ్మ ఆలయం ఆరోవ వార్షికోత్సవం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా అమ్మవారికి ఆయా ప్రాంతాల్లోని భక్తులు మహా కుంభం సమర్పించారు. కావిళ్లతో స్వీట్లు, అన్నం, పసుపు కుంకుమ, గాజులు తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. అనంతరం అఖండ అన్నసమారాధన జరిగింది. నగర పంచాయతీ విప్ పడాల శ్రీనివాసరెడ్డి, మోటుపల్లి ప్రసాద్, నొకట్ల రామారావు, రామరాజు పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాల నిరసన



నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘ నాయకులు

తణుకు అర్బన్: హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ విద్యార్థులపై పోలీసులతో చేయిస్తున్న దమనకాండతో తెలంగాణ ప్రభుత్వ వైఖరిని ఖండించాలని విద్యార్థి సంఘాల నాయకులపై పెట్టిన కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని, విశ్వవిద్యాలయాల భూములను పరిరక్షించాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి టి. అప్పలస్వామి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎస్సీ కళాశాల హాస్టల్ ప్రాంతంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో దాదాపు 400 ఎకరాల భూములను అక్కడి ప్రభుత్వం అన్యాక్రాంతం చేయడానికి చూస్తుందని, ఇవి విశ్వవిద్యాలయానికి సంబంధించిన భూములని అలాంటి భూములను వ్యాపారానికి ఉపయోగించేటట్టుగా అక్కడి ప్రభుత్వం చూస్తుందని విమర్శించారు. విశ్వవిద్యాలయంలోకి జేసిబిలతో పోలీసుల సమక్షంలో చెట్లను నరుకుతుండగా అక్కడి విద్యార్థి సంఘాల నాయకులు పోలీసులను అడ్డుకున్న క్రమంలో విద్యార్థి సంఘం నాయకులకు పోలీసులకు మధ్య ఘర్షణ వాతావరణం రావడంతో అక్కడి కొంతమంది విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేయడం అన్యాయమన్నారు. నాయకులు, పలు వివిధ విద్యార్థి సంఘాల నాయకులు ఉన్నారని వీరిపై పెట్టిన కేసులను తక్షణమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని విశ్వవిద్యాలయాల భూములను పరిరక్షించే విధంగా అక్కడ ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు లేని పక్షంలో వివిధ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరు ఉధృతం చేయనున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎం. సంతోష్, యు. తేజ, జి మహేష్, వై మణికంఠ, పి తేజ పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లు మాకొద్దు



విద్యుత్ స్మార్ట్ మీటర్ మా ఇంటికి వద్దంటూ సీపీఎం ముద్రించిన కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం: విద్యుత్ స్మార్ట్ మీటర్ మా ఇంటికి వద్దంటూ సీపీఎం ఆధ్వర్యంలో ముద్రించిన స్టిక్కర్స్‌ను సోమవారం భీమవరం సీపీఎం కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు బి బలరామ్, జిల్లా కార్యదర్శి జెఎన్‌వి గోపాలన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై భారాలు వేసే విధంగా విద్యుత్ స్మార్ట్‌మీటర్స్ బిగించేందుకు రంగం సిద్ధం చేస్తోందని, ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రజలంతా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. స్మార్ట్‌మీటర్లు కారణంగా ప్రజలపై చార్జీలు పెరిగి పెనుభారంగా మారతాయని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా ఆదానితో చేసుకున్న సెకి విద్యుత్ ఒప్పందం ప్రజలపై విపరీతమైన భారం పడుతుందని ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం ఎన్నికల ప్రచారంలో గగ్గోలుపెట్టిందని ఎన్నికల ప్రచారంలో చంద్రబాబునాయుడు, యువగళం పాదయాత్రలో లోకేష్ తీవ్రంగా వ్యతిరేకించి స్మార్ట్‌మీటర్లు పగలగొట్టండని పిలుపునిచ్చి అధికారంలోకి వచ్చాక నాలిక మడతవేసి మాట మార్చి విద్యుత్ స్మార్ట్ మీటర్లను ప్రతి ఇంటికి బిగించడానికి రంగం సిద్ధం చేయడం దారుణమన్నారు. ఖరీదైన స్మార్ట్ మీటర్ల ఖర్చుకూడా ప్రతి నెల బిల్లులో ప్రజలే భరించాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తంచేశారు. వినియోగదారులు ఎక్కువ విద్యుత్ వినియోగిస్తున్న సమయంలో యూనిట్ రేట్లు ఎక్కువగా ఉంటుదని వీటివల్ల రైతాంగం, ప్రజలపై పెనుభారాలు పడనున్నాయన్నారు. ప్రజలపై పడుతున్న విద్యుత్ భారాలపై ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నోరుమెదపకపోవడం సిగ్గుచేటని విమర్శించారు.

భక్తి శ్రద్ధలతో రంజాన్ ప్రార్థనలు



అప్పారావుపేట గ్రామంలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లీం సోదరులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలో సోమవారం రంజాన్ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పారావుపేట, ఎల్.అగ్రహారం, కొండ్రుప్రోలు, అరుగొలను, ఆరుళ్ల తదితర గ్రామాల్లోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లీం సోదరులు ఒకరికొకరు ముబారక్ తెలుపుకుంటూ పండుగను ఆనందంగా జరుపుకున్నారు. పలువురు ముస్లీం సోదరులు పాయసాలు పంచారు. అప్పారావుపేట మసీదు ప్రెసిడెంట్ షేక్ బులి మీరాసాహెబ్, వైస్ ప్రసాద్ అబ్బు సాహెబ్, యూత్ ప్రెసిడెంట్ షేక్ లాల్ సాహెబ్ పాల్గొన్నారు.

మసీదులో ప్రార్థనలు

అత్తిలి: ముస్లింల పవిత్రదినం రంజాన్ సందర్భంగా సోమవారం అత్తిలి మసీదు, ఈద్గా వద్ద ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లింలు పరస్పరం రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఉపవాస దీక్షలు విరమించి మసీదులో ప్రార్థనలు జరిపారు. హిందువులు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం మత పెద్దలు ఖురాన్ పఠనం చేశారు. అనంతరం పేదలకు దానాలు చేశారు. మసీదు గౌరవ అధ్యక్షుడు మహ్మద్ అబీబుద్దీన్, హస్నైన్, షేక్ ఖాజావలి, షేక్ అబ్దుల్ సత్తార్, షేక్ మస్తాన్, సయ్యద్ సత్తార్, షేక్ సలీం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రంజాన్ వేడుకలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రపంచ మానవళి సుఖశాంతులతో వర్ధిల్లాలి అని మసీద్ ఇమామ్ మౌలానా మొహమ్మద్ అన్వర్ హాసిని అన్నారు. పట్టణంలోని పెద్ద మసీద్ మస్జిదే హనఫియా ఈద్గా మైదానంలో సోమవారం ఈద్-ఉల్-ఫితర్ రంజాన్ పండుగను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈద్ ప్రార్థనలు జరిగాయి. అల్లాహు అక్బర్ తక్బీర్‌ను ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రార్థనలు అనంతరం పెద్దలు, యువకులు, పిల్లలు ఆలింగనాలు చేసుకున్నారు. ఇమామ్ మాట్లాడుతూ ముప్పై రోజులు పాటు ఉపవాసాలు, ప్రార్థనలు చేయడం ద్వారా అల్లా ఆశీస్సులు ప్రతిఒక్కరు పొందినట్లు చెప్పా రు. రంజాన్ నెలలో ముప్పై రోజులపాటు కఠిన ఉపవాసాలు చేసినట్లు చెప్పారు. సేమియా కిర్, హలీమ్, బిర్యానీలు తయారుచేయడం, పలు రకాలు పండ్లను ఇఫ్తార్ విందులు జరిగాయి. ఫిత్రా జకాత్, దానధర్మాలు చేయడం ద్వారా పుణ్య ఫలాలు ఇహ పరలోకాలలో సాఫల్యం పొందుతారని చెప్పారు. అన్ని మతాల సారాంశం ఒక్కటేనని, సామరస్య పూర్వకంగా అన్ని మతస్తులు అన్నదమ్ముల వలే ఉండాలన్నారు. ఈద్ ముబారక్ అంటూ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తు ముస్లిం లందరూ తమ చేతికి నల్ల రిబ్బన్లను కట్టుకొని తమ నిరసనను తెలియజేశారు. మసీద్ అధ్యక్షుడు అబ్దుల్ ఘనీ, సెక్రటరీ మహమ్మద్ షాజహాన్, నానన, మహబూబ్ బాషా, సర్దార్ ఖాన్, ఆటో వలి, షేక్ వలి, సర్తాజ్, షకీల్ ఆసిఫ్, రబ్బాని, బాబర్, ఎస్కె నౌషాద్ మొహిద్దీన్ పాల్గొన్నారు.

కులమతాలకు అతీతంగా రంజాన్..

తణుకు అర్బన్: రంజాన్ పండుగ సందర్భంగా తణుకు బాయ్స్ హై స్కూల్ ఎదురుగా వల్లూరి వారి వీధిలో సోమవారం సామాజిక ఐక్యవేదిక ఆధ్వర్యంలో వేడుకలు నిర్వ హించారు. సామాజిక ఐక్యవేదిక వ్యవస్థాపకుడు పొట్ల సురేష్ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా క్రిస్మస్, రంజాన్ వినాయక చవితి పండుగలు ఒకే వేదికపై నిర్వహించి సమాజానికి సందేశం ఇచ్చే విధంగా నడుస్తున్నట్లు చెప్పారు. ఎండీ సోహిల్, ఇరగవర పు నాగరాజు, పొట్ల రమేష్ , సాయిరాం పెయింట్స్ శ్రీను, వీడియో సాయిరాం, స్వాతి మందుల షాపు బుజ్జి, చిన్ని, వీరమ ల్లు ఫణీంద్ర కుమార్, సుహేల్ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పలువురు వ్యాపారులు, ఐక్యవేదిక సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా రంజాన్ ప్రార్థనలు

పెంటపాడు: రంజాన్ పర్వదినం పురస్కరించుకొని సోమవారం పలు గ్రామాల్లోని మసీదులలో ముస్లీంలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పలువురు ముస్లీంలు పేదలకు దానాలు చేశారు. కె. పెంటపాడు జామియామసీదు, పెంటపాడు పెద్ద మసీదు, సంతమార్కెట్‌లోని ముస్లీంల షాదీఖానాతో పాటు, వల్లూరుపల్లి, మీనవిల్లూరు, విప్పర్రు, తదితర ప్రాంతాల్లో ప్రత్యేక నమాజు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ముస్లీం మత పెద్దలు పాల్గొన్నారు.



తణుకులో రంజాన్ సందర్భంగా కేకు కట్ చేస్తున్న దృశ్యం



అత్తిలి ఈద్గా వద్ద ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



కె. పెంటపాడు జామియా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు